ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

7

గురువారం 11 డిసెంబరు 2025

చలికాలం...అప్రమత్తం





- గతంలో కంటే పెరిగిన చలి
- పిల్లల ఆరోగ్య రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

6

పదికి.. వంద రోజుల ప్రణాళిక

- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యా శాఖ కసరత్తు
- ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ
- సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



6



6

ముగిసిన యువజనోత్సవం

- మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకుంటున్న జేకేసీ కళాశాల విద్యార్థులు

పోలీసులకు ఐ కాన్‌గా డ్రోన్లు



- నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత
- డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

10 లో..

చెరువులకు మహర్దశ

అమృత్ 2.0లో ఆధునికీకరణ

- టెండర్ నిర్వహించిన పబ్లిక్ హెల్త్ శాఖ
- రూ.92.29 కోట్లతో మున్సిపల్ చెరువుల అభివృద్ధి

మున్సిపల్ పట్టణాల్లో చెరువులకు మహర్దశ పట్టింది. తాగునీటి నిల్వలుగా ఉన్న చెరువుల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అమృత్ 2.0 పథకంలో చెరువుల సంరక్షణ, సుందరంగా తీర్చిదిద్దడం, ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు భూగర్భజల నీటి నిల్వలు పెరిగేలా పనులు చేపట్టనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ కేంద్రాల్లోని 32 చెరువుల ఆధునీకీకరణకు ప్రభుత్వం రూ.92.29 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో ఆయా పనులకు ఎట్టకేలకు పబ్లిక్ హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లతో ఆధునీకరించనున్నారు. గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లతో, బాపట్ల జిల్లాలో 7 చెరువుల ను రూ.14.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

ఆధునికీకరణ ఇలా..

- ఆక్రమణలు తొలగించి హద్దుల నిర్ణయం చెరువుల్లో పూడిక తీత చెరువు కట్టల పటిష్ఠతకు రాతితో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- పట్టణ వాసుల నడకకు అనుకూలంగా కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- ట్రాక్ చెరువు వైపు ఇనుప వైరుతో ఫెన్సింగ్ ఏర్పాటు
- చెరువు బయట వైపు కట్టలపై పచ్చిక పెంపకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం కింద పురపాలక సంఘాల్లోని చెరువులను ఆధునికీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణాల్లో భూగర్భ జలాలు పెంపొందించడమే అమృత్ లక్ష్యం. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో పూడిక పేరుకుపోయి రూపు రేఖలు కోల్పోయిన చెరువులకు మహర్దశ పట్టింది. అమృత్ 2.0లో 32 చెరువులు ఆధునికీకరణకు ఎంపిక కాగా రూ.92.29 కోట్లు విడుదలయ్యాయి. ఈ క్రమంలో పబ్లిక్‌హెల్త్‌శాఖ టెండర్ ప్రక్రియ చేపట్టింది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే (మిగతా 10వ పేజీలో)



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

అజ్ఞాతంలో.. భోక్తలు



- జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్.. పరారీ
- అజ్ఞాతంలో మాజీ డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- రూ.22.25 కోట్ల కుంభకోణంపై చర్యలతో ఉలికిపాటు
- ఫోర్జరీ దస్తావేజులతో రూ. కోట్ల రుణాల కేసులో 11 మంది అరెస్టు

వీరిపై కేసులు..

డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు నాటి బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి (ఏ1), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొర్లికొండ కృష్ణ వేణి(ఏ2), నాటి అడ్వైజర్ యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్(ఏ3), నాటి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము(ఏ4), డైరెక్టర్లు నల్లపాటి రామయ్య(ఏ5), కోట హరిబాబు(ఏ6), వట్టికొండ కోటేశ్వరమ్మ(ఏ7), పీట వెంకటేశ్వర్లు (ఏ8), గోవిందనాయక్(ఏ9), వెలిశెల ఏడుకొండలు(ఏ10), కూని శెట్టి శివనవీన్ (ఏ11)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే కేసులో నిందితుడైన లాల్‌పురం రాము 10 రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది.

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రూ.22 కోట్ల కుంభకోణం కేసులో నిందితుడైన నాటి బ్యాంకు చైర్మన్, వైసీపీ నాయకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు అలియాస్ లాల్‌పురం రాము పరారీలో ఉన్నారు. ఆయన చైర్మన్‌గా కొనసాగిన సమయంలో నల్లపాడు బ్యాంకు బ్రాంచ్‌లో చోటు చేసుకున్న అవకతవకలపై కలెక్టర్ ఆదేశాలతో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే అవకతవకలపై బ్యాంకు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కే శీనారెడ్డి దర్యాప్తు చేస్తుండగా విషయాన్ని రాముతో సహా నాటి మాజీ డైరెక్టర్లు అందులో పాత్ర ఉన్న బ్యాంకు ఉద్యోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో తమపై కేసు తప్పదని (మిగతా 10వ పేజీలో)

అసైన్డ్‌పై.. కొరడా



- అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూముల ఫ్రీహోల్డ్
- నాడు మూడు జిల్లాల్లో 4,200 బాధితుల వినతులు బుట్టదాఖలు
- నిర్దిష్ట కాలపరిమితితో న్యాయం చేసే దిశగా నేడు ప్రభుత్వ కార్యాచరణ

చట్ట సవరణ ముసుగులో..

2003కు ముందు పేదలకు అసైన్డ్ చేసిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించేలా ఫ్రీహోల్డ్ చేయడానికి గత ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఈ చట్ట సవరణ ముసుగులోనే వైసీపీ పెద్ద ఎత్తున అసైన్డ్ అక్ర మాలకు పాల్పడింద నే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఒరిజినల్ అసైనీలను భయభ్రాంతులకు గురిచేసి మరీ భూములను ఫ్రీహోల్డ్ చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. పల్నా డు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో దాదాపు 15,000 ఎకరాలను నిబంధనలకు విరు ద్ధంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే 2,686 ఎకరాల ను ఫ్రీహోల్డ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అసైన్డ్ చట్ట సవ రణ ఆధారంగా దాదా పు 6,000 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ బాట పట్టినట్లు సమాచా రం. ఇక ఈ చట్టంతో సంబంధం లేకుం డా స్థానికంగా ఉండే నేతల మాటలే ఆదేశాలుగా వేల సంఖ్యలో భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించి అప్పనంగా దోచేశారు. ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్‌లో పడేసి నిషేధిత జాబితాలో దాదాపుగా పదివేల ఎకరాల భూములను చేర్చారని సమాచారం. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ అసైన్డ్ అక్రమాలను ఆధారాలతో సహా నిలదీసినా పట్టించు కోలేదు. ప్రస్తుతం ఆయా అసైన్డ్ అక్రమాలపై నిగ్గు తేల్చి త్వరితగతిన వివాదాలకు ముగింపు పలకాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు పాతరేస్తూ, రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా గత ప్రభుత్వంలో అసైన్డ్ భూ దందా ఆకాశమే హద్దుగా సాగగా.. కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై చర్యలకు సిద్ధమైంది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 4,200 వినతులు వైసీపీ ప్రభుత్వంలో అందగా వాటిని బుట్టదాఖలు చేసి భూ అక్రమార్కులకు నాటి పాలకులు వత్తాసు పలికారు. అసైన్డ్ అక్రమాలపై విచారణ జరిపి, అడ్డగోలు వ్యవహారాలపై చర్యలు తీసుకుంటామని కూటమి నేతలు ఎన్నికలకు ముందే బాధితులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ల నుంచి అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ జాబితాపై నివేదికలను (మిగతా 10వ పేజీలో)

మట్టి తవ్వకాలను అడ్డుకున్న వీఆర్వో

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరు గ్రామంలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను వీఆర్‌వో రామకృష్ణ మంగళవారం రాత్రి అడ్డుకున్నారు. గత కొన్ని రోజులుగా అక్రమార్కులు యథేచ్ఛగామట్టితవ్వకాలు చేపడుతున్నారు. నిత్యం వందలాది లారీల్లో మట్టిని నరసరావుపేట చుట్టుపక్కల వెంచర్లకు తరలిస్తున్నారు. వీఆర్వో అడ్డుకోవడంతో ప్రస్తుతం తాత్కాలికంగా మట్టి తవ్వకాలు నిలిచాయి.



ప్రభుత్వ భూమిలో జరుగుతున్న మట్టితవ్వకాలు

వేగంగా.. ఫైళ్లు పరిష్కారం

- నాలుగో స్థానంలో కలెక్టర్ కృతికా శుక్లా
- 110 ఫైళ్లు స్వీకరణ.. 73 ఫైళ్లు క్లియరెన్స్

నరసరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల పరిష్కారంలో కలెక్టర్ కృతికా శుక్లా ముందున్నారు. జిల్లాల వారీగా ఫైళ్ల పరిష్కారంపై సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షిం చారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఫైళ్ల పరిష్కార వివరాలను ప్రకటించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలు, పథకాల మంజూరు వంటి అంశాలపై స్వీకరించిన ఫైళ్లను క్లియర్ చేయడంలో కృతికాశుక్లా రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ-ఫైల్ విధానంలో 110 ఫైళ్లను స్వీకరించగా 73 ఫైళ్లను పరిష్కరించారు. ఒక్కొక్క ఫైల్ క్లియరెన్స్‌కు కృతికాశుక్లా ఒక రోజు సమయం తీసుకున్నారు. సబంధింత శాఖలకు కొన్ని ఫైళ్లను పరిష్కారం కొరకు పంపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఇటీవల బదిలీ కాగా ఈ-ఫైలింగ్‌లో జేసీ లాగిన్‌కు వచ్చే ఫైళ్లలో మూడు ఫైళ్లను స్వీకరించగా రెండింటిని కలెక్టర్ పరిష్కరించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

22న జాబ్‌మేళా

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకుల కోసం వినుకొండలో ఈ నెల 22న ఉదయం 9 గంటల కు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ జాబ్‌మేళా గోడప్రతులను నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిసర ప్రాంత యువతీ యువకులు ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సూచనల మేరకు వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీ రావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 35 కంపెనీలు పాల్గొంటాయని, ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హతను బట్టి రూ.13 వేలు నుంచి రూ.35 వేలు జీతం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9951214919, 9100566581, 9160200652 నంబర్లను సంప్రదించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఝాన్సి, పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఏషియన్ పోటీల్లో చంద్రికకు కాంస్యం



బొల్లినేని చంద్రిక

మంగళగిరి సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక 84 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించింది. టర్కీలో ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ఏషియన్ సీనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చంద్రిక స్క్వాట్ విభాగంలో రజతం, బెంచిప్రెస్‌లో కాంస్యం, డెడ్‌లిఫ్ట్‌లో కాంస్యం సాధించి ఓవరాల్‌గా కాంస్య పతకం సొంతం చేసుకుందని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. చంద్రికను ఆమె కోచ్ నరేంద్రను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

47,152 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 48,555 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,152 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,892 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17200	334	10500	17000
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	----	----	273	----	----
341	10500	16500	341	11000	16400
4884	----	----	4884	11500	14300
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	16900
బ్యాడిగి	10500	15700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7500
ఆర్మూరు	10500	12800			

గ్రావెల్ సరఫరాకు కమిటీలు

- కమిటీలకు చైర్మన్లుగా ఐదు జిల్లాల కలెక్టర్లు
- మెంబర్ కన్వీనర్‌గా జిల్లా గనులశాఖ అధికారి
- సీఆర్డీఏ ప్రతినిధి, ఆర్డీవో సహా మరో ఐదుగురు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు చేపడుతోంది. రాజధాని పరిధిలో జరుగుతున్న పనులకు అవసరమైన గ్రావెల్, రోడ్డు మెటల్, ఇసుక సరఫరా చేయడంలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాజధాని మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే ఐదు జిల్లాల్లో ఐదు ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కమిటీలు

సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చే గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఆయా జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. జిల్లా గనుల శాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితోపాటు సీఆర్డీఏ ప్రతినిధి, సంబంధిత ఆర్డీవో, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) జోనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జిల్లా అటవీ అధికారి, సీఆర్డీఏలోని కాంట్రాక్టర్ల ప్రతినిధులు కొందరు సభ్యులుగా ఉంటారు.

● త్వరతగతిన అనుమతులు

ఈ కమిటీ గ్రావెల్, రోడ్ మెటల్, ఇసుక సరఫరాకు సంబంధించిన లీజులను మంజూరు చేయడం, సరఫరాలో జాప్యం జరగకుండా చేయడం వంటి పనులను పర్యవేక్షిస్తుంది. సీఆర్డీఏ సూచించిన కాంట్రాక్టు సంస్థల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, వాటికి రెవెన్యూ శాఖ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) కాలుష్య నియంత్రణ మండలి నుంచి పర్యావరణ అనుమతులు వేగంగా వచ్చేలా ఈ కమిటీ చూస్తుంది. అందుకోసం సింగిల్ విండో విధానాన్ని కమిటీ అనుసరిస్తుంది. కాగా రాష్ట్రస్థాయి కమిటీకి సీఆర్డీఏ అదనపు కమిషనర్ చైర్మన్‌గా ఉంటారు. గనులశాఖ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా ఉంటారు. మిగిలిన అన్నివిభాగాల ఉన్నతస్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి కమిటీలో ఉంటారు. జిల్లాస్థాయి కమిటీలు వారానికోసారి, రాష్ట్రస్థాయి కమిటీ 15 రోజులకోసారి సమావేశమై మెటీరియల్ సరఫ రా, అవసరమైన అనుమతులపై సమీక్ష జరుపుతాయి. సమస్యలుంటే వాటిని వారం రోజుల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాయి.

14న యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం



ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎన్ వెంకటేశ్వర్లు, ఏఎస్ఎస్ ప్రసాద్ తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో ఆహ్వానపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యూ.రాజశేఖర్, ఎం కళాధర్ మాట్లాడుతూ, కౌన్సిల్ సమావేశానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామని వెల్లడించారు. అలాగే ఉపాధ్యాయ వర్గ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి.ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

- పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్
- మండల ప్రత్యేక అధికారి శ్రీ కృష్ణ దేవరాయలు

మాచవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఎంపీపీ ఎన్నిక నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల ప్రత్యేక అధికారి, ఎన్నికల అధికారి శ్రీ కృష్ణ దేవరాయలు బుధవారం తెలిపారు. ఇటీవల ఎంపీపీ దారం అంబులమ్మ మరణించటంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల సందర్భంగా పరిసర ప్రాంతాల్లో 144వ సెక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సభ్యులందరికీ నోటీసుల ద్వారా సమాచారం అందించామని చెప్పారు. ఎన్నిక నిర్వాహణ సక్రమంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ముందుగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

వినుకొండటౌన్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): కారు ఆటో ఎదెరెదురుగా ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చీకటీగల పాలెం వద్ద బుధవారం జరిగింది. నూజండ్ల మండలం పాత చెరుకుపాలెం గ్రామానికి చెందిన ఈదర అచ్చిబాబు (40) వినుకొండ నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అచ్చిబాబు అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కోటేశ్వరమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మశీ విద్యలో నాణ్యత పెంచాలి

- ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న జశుబాయి హీరాబాయ్ చౌదరి తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మశీ విద్యలో నాణ్యత పెంపొందించడానికి బయో మెట్రిక్ హాజరు వ్యవస్థ ఎంతో కీలకమని ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జశుబాయి హీరాబాయ్ చౌదరి అన్నారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో బుధవారం ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మసీ కాలేజీల్లో ఫ్యాకల్టీ, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ఇది సహాయపడుతుందని అన్నారు. అనంతరం సదస్సులో పీసీఐ ఐటీ విభాగం చైర్మన్ డాక్టర్ పి.సత్యమూర్తి, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, ఏపీసీఐ ప్రతినిధులు డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ ఎమ్ ప్రసాదరావు, విజ్ఞాన్ ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస్ బాబు, బాపట్ల ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న భవిష్యనిధి అదాలత్

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న భవిష్యనిధి పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడానికి ఈ నెల 12న భవిష్యనిధి అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.50 వరకు కృష్ణనగర్‌లోని కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలుంటే ఈ మెయిల్ (ro.guntur@epfindia.gov.in),వాట్సప్ (9494657469) ద్వారా పంపవచ్చన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం నాటికి 575.90 అడుగులు ఉంది. ఇది 2713.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,156 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,623 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,623 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 43.01 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

స్త్రీ శక్తితో ప్రభుత్వానికి మంచి పేరు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించేలా స్త్రీ శక్తి పథకం అమలుతో కూటమి ప్రభుత్వానికి మంచి పేరు, ప్రఖ్యాతలు వస్తున్నాయని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. అదే సమయంలో సిబ్బందిని రిక్రూట్ చేయకుండా, బస్సులు పెంచకుండా ఉంటే మంచిదికాదని ఆయన పేర్కొన్నారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని కొత్తపేట మల్లయ్యలింగం



సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు తదితరులు

భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిబ్బంది చిన్న చిన్న పొరపాట్లకు కూడా క్షమించకుండా సస్పెండ్‌లు, తీవ్రమైన ఇక్రిమెంట్‌లు, పనిష్‌మెంట్లు చేస్తున్న విధానాలను డిపో మేనేజర్లు మానుకోవాలని అన్నారు. ఈ నెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణలను ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, నాయకులు ఈ. విజయ్‌కుమార్, రత్నాకర్, డీవీ స్వామి, వలి, జి.ప్రకాశ్, వాకా రమేష్, త్రిలోచన దత్తు, తదితరులున్నారు.

● ఆర్టీసీ ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు

సమావేశం అనంతరం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు నూతన కమిటీని ప్రకటించారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్ శ్రీనివాసరావు (టోపీ శ్రీను), రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కేవీఎస్ నరసింహరావు, నెల్లూరు జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె లక్ష్మయ్య, నెల్లూరు జోన్ సహాయ కార్యదర్శిగా జి ప్రకాశ్, జిల్లా జాయింట్ సెక్రటరీగా జి కృష్ణవేణి, జిల్లా ముఖ్య సలహాదారుగా కె దండేశ్వరుడులతో కూడిన కమిటీని ప్రకటించారు.

ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చాలి

- డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల కనీస అవసరాలు తీర్చేలా ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ కోరారు. అరండల్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్ తదితరులు

పేటలోని కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. మానవ హక్కులు, కనీస అవసరాలైన రక్షిత మంచి నీరు, స్వచ్ఛమైన గాలి, పౌష్టికారం, గృహవసతి, మెరుగైన ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలని కోరారు. మానవ హక్కుల కార్యకర్త ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ, 2029 నాటికి ఎనిమిది సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్‌ను చేరేందుకు ప్రతి ప్రభుత్వం కృషి చేయాలని, మన దేశంలో వివిధ రంగాల్లో మనం ఇంకా ఎంతో వెనకబడిపోయి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో న్యాయవాది పొందుగల ప్రకాష్, బీసీ ఉద్యమ రాష్ట్ర నేత ఉగ్గం సాంబశివరావు, గెజిటెడ్ ఆఫీసర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుస్సా రత్నప్రసాద్, ఆవాజ్ నాయకులు చిష్టి సామాజిక వేత్త డాక్టర్. మూకిరి సుధా, వాయిస్ ఆఫ్ జస్టిస్ నేత ప్రశాంతి, చంద్రనాయక్, తురకా వీరయ్య, నల్లపు నీలాంబరం, కొరివి రజనీష్, పాలకాయల వెంకట్, ప్రకాష్, బి సురేంద్ర, సూరిబాబు, రామారావు, మద్ద శ్యామ్, సురేష్, పిల్లి రమేష్ తదితరులున్నారు.

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం నిమిత్తం భూములను అందజేసిన ఉండవల్లి గ్రామ రైతులకు ఈ లాటరీ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ఈ కార్యక్రమం బుధవారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగింది. 11 మంది రైతులు, భూ యజమానులకు ఈ-లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. వీటిల్లో 11 నివాస ప్లాట్లు కాగా 5 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్ని కృష్ణ మాట్లాడుతూ, ప్లాట్లు ఎక్కడ దక్కాయో రైతులకు వివరించేందుకు ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ పక్రియకు ఎలాంటి రుసుము వసూలు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాట్లు పొందిన రైతులకు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్డీఏ డీసీ చిన్ని కృష్ణ

పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయస్థాయి శిక్షణ

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో పిండోత్పత్తి, పిండమార్పిడిపై జాతీయ స్థాయిలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న పశు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎం ముత్తారావు తెలిపారు. లాం ఫారము నందు ఈ నెల 11 నుంచి 20 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఆయన బుధవారం తెలిపారు. దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దేశంలో ఉన్న దాదాపు 20 కోట్ల గోజాతి పశువులలో 75-80% దేశవాళీ ఆవులున్నాయన్నారు. ఈ దేశవాళీ గోవుల వారసత్వ సంపద మాత్రమేగాక, గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి ఇతోధికంగా దోహదం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా భూమి లేని, చిన్న, సన్నకారు రైతుల ఇంటిల్లిపాది అవసరాలకు దేశవాళీ ఆవుల పాత్ర ఎంతగానో వుంటుందన్నారు. భారత ప్రభుత్వం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా దేశవాళీ ఆవులలో ఉత్పాదక శక్తిని(పాలదిగుబడి) పెంచడానికి చేపట్టిన వినూత్న కార్యక్రమమే ఈ 'పిండోత్పత్తి, పిండమార్పిడి జీవసాంకేతిక ప్రక్రియ' అని తెలిపారు. ఈ నూతన ప్రక్రియను చేపట్టి అందులో శాస్త్రవేత్తలను నిష్ణాతులుగా తయారు చేసే బాధ్యతను లాం ఫాంలోని పశు పరిశోధనా స్థానానికి అప్పగించారని తెలిపారు. దీనిలో భాగంగా అక్టోబరులో మొదటి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జరిగేది రెండో దశ శిక్షణా కార్యక్రమమన్నారు.

వైసీపీ నాయకులకు అర్థంకాని పీపీపీ విధానం

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పీపీపీ విధానం అర్థంకాక వైసీపీ నాయకులు కల్లు తాగిన కోతుల్లా ఎగురుతున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎద్దేవా చేశారు. బుధవారం అందుకూరులో నిర్వహించిన వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీపీపీ విధానంపై వైసీపీ నాయకులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. తమ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ నాయకులు తిరుగుతున్నారని, కోటి సంతకాల కార్యక్రమం పెద్ద డ్రామా అని అభివర్ణించారు. చంద్రబాబు ఏ పని చేసినా ప్రజల దీర్ఘ కాలిక ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని చేస్తారన్నారు. పీపీపీ విధానంపై కనీస అవగాహన లేకుండా వైసీపీ నాయకులు దాన్ని వ్యతిరేకించటం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసిన ఏ విధానం కూడా విఫలం కాలేదని, ఈ విధానాన్ని కూడా ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు జరిగే తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ పరిధి ఇంజనీర్ విభాగంలో బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ పరీక్షలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల పరిధిలోని బాపట్లలో పరీక్ష కేంద్రంలో కూడా నిర్వహించామన్నారు. పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని తెలిపారు.

వ్యక్తికి జీవిత ఖైదు

- తల్లిదండ్రులను హత్య చేసినందుకు శిక్ష



పాగోలు కిరణ్ చంద్ర (ఫైల్‌ఫొటో)

బాపట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అత్యంత క్రూరంగా హత్య చేసిన నిందితుడికి బాపట్ల 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు జీవిత ఖైదు విధించింది. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన పాగోలు కిరణ్‌చంద్ర తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైరయి పెన్షన్ పొందుతున్నారు. పెన్షన్ వచ్చిన ప్రతిసారి నిందితుడు డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడేవాడు. తల్లిదండ్రుల ఆస్తిని తనకు కాకుండా తన అక్కకు, ఆమె పిల్లలకు రాస్తారేమో అనే అనుమానంతో 2024 సంవత్సరం డిసెంబరు 14న కిరణ్‌చంద్ర తన తల్లిదండ్రులు పాగోలు విజయభాస్కర్ (74), పాగోలు వెంకటసాయికుమారి (71)ని రోకలిబండతో కొట్టి హత్యచేసి పారిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేల జరిమాన విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

నకిలీ పోలీసు అరెస్టు

- మహిళను మభ్యపెట్టి బంగారం కాజేసిన తీరు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీసీఎస్ పోలీసునని చెప్పి మచిలీపట్నంలోని ఒక మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం కాజేసిన నిందితుడిని బుధవారం చిలకలపూడి పోలీసులు అరెస్టు చేశారు. చిలకలపూడి సీఐ నబీ వివరాల ప్రకారం, నరసరావుపేటకు చెందిన మేకల సాయికుమార్ మచిలీపట్నంలో ఓ మహిళను మభ్యపెట్టి 90 గ్రాముల బంగారం తీసుకున్నాడు. మహిళ ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు నిందితుడి కోసం గాలించారు. కాగా నిందితుడు సాయికుమార్ నరసరావుపేటకు చెందినవాడని తేలింది. గుంటూరు, రాజమండ్రి, ఏలూరులో మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి బంగారం, నగదును తీసుకున్నట్టు అతడిపై పలు కేసులున్నాయి. నిందితుడు సాయికుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం శ్రీనివాస తండాకు చెందిన సిద్ధు నాయక్, అతని భార్య జ్యోతి భాయ్ (26) జీవనోపాధి నిమిత్తం కొన్ని సంవత్సరాల క్రితం తక్కెళ్ళపాడు వచ్చారు. అక్కడ బ్రిక్స్ రాయి తయారుచేసే యూనిట్లో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో జ్యోతి భాయ్ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం

కారంపూడి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్సా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలోని 46 దూడలు, 100 పశువులకు గొంతువాపు వ్యాధి టీకాలు అందించారు. 15 ఆవులు, 35 గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు పశువైద్యాధికారి దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డాక్టర్ నేలపాటి శివరామకృష్ణ, ఫణేంద్ర, ఉన్నం ముక్కంటి, బొంతు సంజీవరెడ్డి, గుదిబండ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్‌కు మినహాయింపు ఇవ్వాలి

పిడుగురాళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్‌లో వున్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పిడుగురాళ్ల తహసీల్దార్ జె మధుబాబుకు యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే ఖాశింపీరా, జిల్లా కార్యదర్శి షేక్ జమాల్, ఎంవీ సాంబశివరావు, జి.ప్రసాదరావు, డి సాయిబాబా, డి.శ్రీనివాసరావు, ఎస్‌కే ఫిరోజ్‌భాషా, ప్రసాద్, ఆనంద్‌కుమార్, రాజశేఖర్, హనుమంతరావు, శివశంకర్, నాగేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందించిన వారిలో వున్నారు.

పిడుగురాళ్ల నగర పంచాయతీ తొలి చైర్మన్ మృతి


బలరామకృష్ణ (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల నగర పంచాయతీ మొదటి చైర్మన్ ముమ్మడి బలరామకృష్ణ(62) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మేజర్ పంచాయతీగా వున్న పిడుగురాళ్ల నగర పంచాయతీ అయ్యాక 2006-11 వరకు ఆయన నగర పంచాయతీ చైర్మన్‌గా పట్టణాభివృద్ధికి కృషి చేశారు. బలరామకృష్ణ మృతిపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

దేవాలయాల్లో చోరీ

సత్తెనపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండు పురాతన దేవాలయాల్లో మంగళవారం అర్ధరాత్రి తరువాత చోరీ జరిగింది. పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయం, శివాలయాల్లోకి ఇద్దరు దొంగలు ప్రవేశించి హుండీల్లో నగదును దోచుకువెళ్ళారు. వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఒక హుండీని, శివాలయంలో రెండు హుండీలను కట్టర్లతో కట్‌చేసి అందులోని నగదును దోచుకువెళ్ళారు. బుధవారం ఉదయం ఆయా దేవాలయాల వాచ్‌మెన్‌లు జరిగిన సంఘటనపై ఈవో కోటిరెడ్డికి సమాచారం అందించటంతో ఆయన పట్టణ పోలీసులకు తెలియజేశారు. సీఐ నాగమల్లేశ్వరరావు తమ సిబ్బందితో పరిశీలించారు. దొంగతనం సీసీ కెమేరాల్లో రికార్డు అయింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మొత్తం రూ.లక్ష వరకు చోరీ జరిగి ఉంటుందని ఈవో కోటిరెడ్డి తెలిపారు. కోటిరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నకరికల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): త్రిపురాపురం కొండపై అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌పై కొండ చరియ విరిగిపడింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జార్ఖండ్‌కు చెందిన డ్రైవర్ హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతను చికిత్సపొందుతున్నాడు.

నియోజకవర్గంలో 55వేల సంతకాల సేకరణ

● మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటానికి వ్యతిరేకంగా పెదకూరపాడు నియోజకవర్గంలో 55వేల సంతకాలను సేకరించినట్లు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. సంతకాల ప్రతులను ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం క్రోసూరు వైసీపీ కార్యాలయం నుంచి సంతకాల ప్రతుల వాహనానికి జెండా ఊ పి ఆయన సాగనంపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

మాచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మానవ హక్కుల దినోత్సవం ప్రాముఖ్యతను ఎస్సీ ఎస్టీ విజిలెన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కుక్కమూడి ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో పేరుపోగు జార్జి, గురజాల అప్పారావు, పరిమళ రాజారావు, పేరుపోగు అచ్చిబాబు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గుడ్ షెపర్డ్ సిస్టర్స్ కాన్వెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు జరిగింది. ర్యాలీలో విద్యార్థులు, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మాచర్ల రూరల్: పట్టణంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, సబ్‌ట్రెజరీ ఆఫీసర్ రామునాయక్, ఎస్‌బీఐ మేనేజర్ సతీష్, రబ్బాని, రామకృష్ణారావు, మర్రెడ్డి, చంద్రయ్య, కిరీటిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

క్రోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎగ్జిబిషన్‌లో తమ వస్తువులను ప్రదర్శించారు. దొడ్లేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన గ్రూపు ప్రాజెక్టుకు ప్రథమస్థానం, మరో ప్రాజెక్టుకు ద్వితీయస్థానం, మరో ప్రాజెక్టు ఎయిర్ ప్యూరీ ఫైర్‌కు ద్వితీయస్థానం లభించినట్లు అధికారులు తెలిపారు. క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ఆటోమాటిక్ ఫ్యాన్ ఆన్ ఆఫ్ విత్ యూజింగ్ ఆర్డినియో మోటార్ సెన్సార్‌కు తృతీయ స్థానం లభించినట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా క్రోసూరు ఎంఈవో జీ కృష్ణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబూరావు, ఉపాధ్యాయులు చిలకా సురేష్ వ్యవహరించారు.

బ్రహ్మానందపురం తండాలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

విజయపురిసౌత్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం బ్రహ్మానందపురంతండాలో బుధవారం స్థానిక ఏపీఆర్‌డీసీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలతో విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్ నయీంబాను, డాక్టర్ ఎస్‌కే మహ్మద్ బాషా, హెచ్‌ఎం చంద్రశేకర్, అంగన్‌వాడీ టీచర్ హసీనా, మల్లినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా అప్పారావు

పిడుగురాళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఏపీఎన్‌జీవో సంఘ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పిడుగురాళ్లకు చెందిన ఇసరాజుల వెంకట అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసరావుపేటలో అసోసియేషన్ ఎన్నికలలో అప్పారావును ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పిడుగురాళ్ల ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు పట్టాభి, కార్యదర్శి శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతలు అప్పారావును సత్కరించారు.


వెంకట అప్పారావును సత్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ సంఘ నేతలు

సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తా

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


సమస్యలను వింటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వంద రోజులు వంద గ్రామాలు ప్రజలకు వద్దకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యక్రమం పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్పించనున్నట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. బుధవారం అందుకూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం లో సమయం తక్కువగా ఉన్నందున అన్ని గ్రా మాలు తిరగలేక పోయానని, ఇప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నానన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వే లోపభూయిష్టంగా జరిగిందని, ప్రజల నుంచి అధిక శాతం అర్జీలు వీటిపైనే అందుతున్నాయన్నారు.రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూల్‌ను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. టీడీపీ నాయకులతో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీ నాగరాజు, ఎంపీడీవో రవికుమార్, దిగుమర్తి అప్పారరావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వాసిరెడ్డి వెంకటరావు, దుగుమర్తి తిరుమలరావు, చావా మురళీ, చావా నాగేశ్వరరావు, వాసిరెడ్డి మురళీ, వాసిరెడ్డి వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు పరామర్శ

బెల్లంకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెం గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన గొడ్డలి వేటు సంఘటనలో గాయపడి గుంటూరులో చికిత్స పొందుతున్న బెల్లంకొండ మాజీ ఎంపీపీ ఓర్సు ఏడుకొండలు కుమారుడైన కృష్ణయ్యను ఆస్పత్రిలో బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ ఎంపీపీ ఏడుకొండలను ఓదార్చారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షులు అక్కల వెంకటరామిరెడ్డి, బెల్లంకొండ దేవదాయ శాఖ అధికారి కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

గుర్రపు డెక్కతో నిండిన తంగెడ మేజరు

● సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న మిర్చి రైతులు

● పూత, పిందె దశలో మిరప పొలాలు


గుర్రపు డెక్కతో నిండిన తంగెడ మేజరు కాలువ

దాచేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మిర్చిపంట పూత, పిందె ఉన్న దశలో సకాలంలో సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తంగెడ మేజరు పరిధిలో కారంపూడి, దాచేపల్లి, పిడుగురాళ్ళ మండలాలకు చెందిన 36వేల ఎకరాల సాగు భూమి ఉంది. మేజరు కాలువ పరిధిలో 12వేల ఎకరాలు మిరప పంటలు రైతులు సాగు చేశారు. పూత, పిందె దశలో ఉన్న పంటకు సాగు నీరు ఎద్దడి రావటం రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. తంగెడ మేజరు కాలువ అంతా మట్టి, గుర్రపు డెక్క, నాచుతో నిండి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. ఎకరాకు రూ.లక్షకు పైచిలుకు పెట్టుబడి వెచ్చించి సాగు చేసిన రైతులకు సాగునీటి సమస్య పట్టి పీడిస్తుంది. మేజరు పరిధిలో పెదగార్లపాడు, చినగార్లపాడు, తక్కెళ్ళపాడు, కేసానుపల్లి, వీరాపురం, శాంతినగర్, దాచేపల్లి, తంగెడ, మాదినపాడు, ఎస్ అగ్రహారం గ్రామాల రైతులు ఉన్నారు. ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించకపోతే రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ పసుపులేటి ఆదినారాయణను వివరణ కోరగా ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి కూడా తీసుకువెళ్ళామని వివరించారు. త్వరలో కాలువలో ఉన్న గుర్రపు డెక్క, నాచు తొలగింపు చర్యలు చేపడుతున్నామని, సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ బాలాజీ


దేవాలయ పునఃనిర్మాణ మ్యాపును పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజీ

కారంపూడి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల శివారులో గల శ్రీసింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని బుధవారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. దేవాలయం పునఃనిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. పనులను చేపట్టాలని సూచించారు. బాలాజీని ఈవో సీహెచ్ శివనాగిరెడ్డి, ధర్మకర్త గుండాల శ్రీనివాసరావులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలి

● ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి


దేచవరం మోడల్ స్కూల్‌లో సరుకులను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు

నకరికల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ పౌష్టికాహారం సక్రమంగా అందేలా, కేంద్రాలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన నరసింగపాడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం నకరికల్లు ఎస్‌వీవీఆర్ జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. దేచవరం గ్రామంలో మోడల్ స్కూల్ హాస్టల్‌ను లక్ష్మీరెడ్డి తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, స్టాక్‌ను, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యత ప్రమాణాల్లో, శుచి, శుభ్రత పాటించాలని హాస్టల్ ఉద్యోగులకు సూచించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండి పని చేయాలన్నారు.

విద్యుత్ శాఖ, విజిలెన్స్ విస్తృత తనిఖీలు

● రూ.3.52 లక్షలు అపరాధ రుసుం

అచ్చంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షకులు ఇంజనీరు కేవీఎల్ఎన్ మూర్తి పల్నాడు జిల్లా ఆపరేషన్ విభాగ పర్యవేక్షక ఇంజనీరు డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అచ్చంపేట సెక్షన్‌లోని తాడువాయి, చల్లగరిగ, తాళ్ళచెరువు, కోనూరు, పెదపాలెం, వేల్పూరు, చింతపల్లి, చిగురుపాడు, ఓర్వకల్లు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీపీఈ ఎస్‌ఏ కరీం, ఏఈ సీహెచ్ రాంబొట్ల తదితరులతో పాటు మరో 53మంది అధికారులు, 159 మంది సిబ్బంది 53 బృందాలుగా 3,263 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 24మందికి రూ 0.41లక్షలు, మీటరు ఉండి విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న 14మందికి రూ 2.05లక్షలు, అదనంగా లోడు విద్యుత్ వాడుకున్న 40మందికి రూ 1.06లక్షలు, మొత్తం రూ 3.52లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. దాడుల్లో డీఈఈ ఎం శ్రీనివాసరావు, విజిలెన్స్ డీఈఈ ఏ శ్రీనివాసరావు, మల్లిఖార్జన ప్రసాదు, ఏఈ పీ శ్రీనివాసరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

దేవాలయ భూములకు కొలతలు వేసిన అధికారులు

రెంటచింతల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికల్లు గ్రామంలో వున్న శ్రీ సీతారామస్వామి ఆలయానికి సంబంధించిన ఇనామ్ భూములకు బుధవారం వివిధ శాఖల అధికారులు కొలతలు వేశారు. ఆలయ భూములను ఇతరులెవరైనా ఆక్రమించారా..? రికార్డులు ప్రకారం వున్నాయా లేవా అని ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి నేతృత్వంలో పరిశీలన జరిగింది.. ఉన్నతాధికారులకు సర్వే నివేదికను అందచేయనున్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ఈశ్వర ప్రసాదాచారి, వీఆర్వో విఘ్నేష్, రైతులు పాల్గొన్నారు.

అటవీభూముల హద్దుల పరిశీలన


కర్లపూడి వద్ద అటవీశాఖ హద్దులు పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రెండవ దఫా భూ సమీకరణ జరిగే నాలుగు రెవెన్యూ గ్రామాలలో ఉన్న అటవీ భూములకు సంబంధించిన హద్దులను బుధవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కర్లపూడి వద్ద పరిశీలించారు. లేమల్లె, ఎండ్రాయి, పెదమద్దూరు గ్రామాలలో ఉన్న అటవీభూముల రికార్డులలో ఉన్నవిధంగా ఏర్పాటుచేసిన హద్దురాళ్లను గతంలో పరిశీలించారు. కార్యక్రమంలో డీఏఓ చంద్రారెడ్డి, తహసీల్దార్ దానియేలు, డీఆర్‌ఓ రామకృష్ణ, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పెదకూరపాడులో రాష్ట్ర స్థాయి క్రీడలు


కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

పెదకూరపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడలు పెదకూరపాడు శ్రీచైతన్య స్కూల్లో జరగటం ఎంతో గర్వంగా ఉందని టీడీపీ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం పోటీలను టీడీపీ మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, రమేష్, నిర్వాహకులు గుత్తా కవితా రాములతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ

అచ్చంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని జడ్పీ హైస్కూల్లో బుధవారం ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్ నాయక్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భోజనం క్వాలిటీ ఉండేలా చూడాలని, ఎక్కువ మంది విద్యార్థులు భోజనం చేసేలా వండాలని సూచించారు. వీరితో పాటు డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

వెంకాయమ్మకు కొమ్మాలపాటి నివాళులు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టావారిపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మదమంచి రాంబాబు మాతృమూర్తి మదమంచి వెంకాయమ్మ దశదిన కార్యక్రమం బుధవారం గ్రామంలో జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వెంకాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మదమంచి రాంబాబును కొమ్మాలపాటి పరామర్శించారు. డీఎన్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దరువూరి నాగేశ్వరరావు, గ్రామ, మండల, నియోజకవర్గ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మదమంచి రాంబాబును పరామర్శిస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి మూలపురుషుడు ముక్త్యాలరాజా

● ప్రాజెక్ట్ డీఈ శ్రీకాంత్

విజయపురిసౌత్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి మూలపురుషుడు శ్రీవాసిరెడ్డి రామగోపాల కృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాల రాజా) అని సాగర్ ప్రాజెక్ట్ డీఈ శ్రీకాంత్ అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ప్రాజెక్ట్ అధికారులు, కూటమి నేతలు స్థానిక ముక్త్యాల రాజా విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ మురళీధర్, టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, జనసేన అధ్యక్షుడు రాహుల్, ఆడెపు కోటయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, మైలపల్లి అప్పలరాజు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, ఘంటా ధనుంజయరావు, నరసింహులు, సీహెచ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు పెరిగిన ప్రాధాన్యం

రెంటచింతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని ఆటల్లో బాగా రాణించాలని సెయింట్ జోసఫ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి అన్నారు. విజ్ఞాన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో గత మూడురోజుల నుంచి నిర్వహిస్తున్న పోటీలు బుధవారంతో ముగిశాయి. అండర్ 17 వాలీబాల్ పోటీల్లో రెంటచింతల శ్రీరామకృష్ణా గురుకులం, అండర్ 14 పోటీల్లో సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రథమ శ్రేణిలో నిలిచారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని 70 పాఠశాలల బాల బాలికలు వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులందచేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమేష్ నాయుడు, పీడీలు మోహనకృష్ణ, నవ్య, హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, రాంబాబు, పాపారావు, శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.


అండర్-17 వాలీబాల్‌లో మొదటి బహుమతి అందుకుంటున్న రెంటచింతల గురుకులం విద్యార్థులు

ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

● జేడీఏ ఎం జగ్గారావు


ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు

నకరికల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ అధికారులు ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు ఆదేశాలు జారీచేశారు. బుధవారం నరసింగపాడు, గుండ్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల విధానాన్ని పరిశీలించారు. తేమ శాతం 17 లోపే ఉన్నా కొందరు మిల్లర్లు ఇబ్బందులు కలిగిస్తున్నారని రైతులు జేడీఏ దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో మార్కెటింగ్ అధికారులు మిల్లర్లతో మాట్లాడినప్పటికీ ఆశించిన స్థాయిలో సహకరించటం లేదని జగ్గారావుకు రైతులు తెలిపారు. అనంతరం బోరు బావుల కింద పెంచుతున్న వరి నారు మడులను ఆయన పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆయనతో పాటు ఏవో కే దేవదాసు, వ్యవసాయ సహాయకులు షేక్ ముస్తక్, సునీల, వై ప్రభాకర్, మార్కెటింగ్ శాఖ అధికారులు ఉన్నారు.

సరికొండ ప్రమాణ స్వీకారం


సరికొండ వెంకటేశ్వరరాజు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, తాతా జయ ప్రకాష్ నారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భట్రరాజు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన సరికొండ వెంకటేశ్వరరాజు బుధవారం గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశా రు. కార్యక్రమంలో ఎమ్మె ల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్‌నారాయణ, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, పలువురు టీ డీపీ నాయకులు వెంకటేశ్వరరాజును అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో భట్రాజుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

అధికారులపై ఎంపీపీ అసహనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంజీవరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోవడంపై ఎంపీపీ సంజీవరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మూడు నెలలకోసారి జరుగుతున్న సమావేశం పట్ల అధికారుల చిన్నచూపు తగదన్నారు. ఈనెలలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు విద్యుత్, విద్యాశాఖా అధికారులు సహకారం ఎంతో అవసరమని వైద్య అధికారులు కోరారు. ఎంపీపీ సంజీవరెడ్డి విద్యుత్ శాఖ అధికారులపై ఆరాతీయగా ఎవరూ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ సంజీవరెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధిలో నడిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

యాచకులు, వృద్ధులకు దుప్పట్లు అందజేత

మాచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి పక్కన జీవిస్తున్న యాచకులు, వృద్ధులకు బుధవారం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ గొబ్బూరి నాగేశ్వరరావు, మెట్టు యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సీతయ్య, సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులకు ఐకాన్‌గా డ్రోన్లు

● నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతికత

● డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసు సిబ్బందికి శిక్షణ

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒక పక్క టెక్నాలజీ పరంగా ముందుకు వెళుతూనే మరో పక్క నేరస్థుల కదలికలతో పాటు అక్రమ రవాణ వంటి పలు అసాంఘిక కార్యకలాపాలను పసిగట్టేందుకు డ్రోన్ టెక్నాలజీ పోలీసులకు బ్రహ్మాస్త్రంగా దొరికింది. మనుషులు వెళ్ళలేని స్థావరాలకు కూడా డ్రోన్‌లను పంపుతూ చిమ చిటుక్కు మన్నా తెలుసుకునే ప్రయత్నాన్ని పోలీసులు మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటికే డ్రోన్‌ల సాయంతో చాలా విషయాలలో సత్ఫలితాలు పొందారు.

● ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒకరికి శిక్షణ

డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు సిబ్బందికే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌కు డ్రోన్ ఆపరేటింగ్‌పై అవగాహన కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. వినాయకుని నిమజ్జన వేడుకలతో పాటు పలు ప్రాంతాలలో జరిగే జాతర్లలో అల్లరి మూకలను గుర్తించి వారి భరతం పట్టేందుకు డ్రోన్ పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగ పడుతోంది. అంతే కాకుండా గంజాయి, గ్రావెల్ వంటి అక్రమ రవాణాను కూడా గుర్తించేందుకు ఇవి ఎంత గానో ఉపయోగ పడుతున్నాయి.

● డ్రోన్ ప్రభావంతో తగ్గుతున్న నేరాలు...

- కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



డ్రోన్ కెమెరాల వల్ల జిల్లాలో నేరాలను నియంత్రించ గలుగుతున్నాం. ప్రతి జిల్లాలో ఐదు లేదా ఆరు డ్రోన్ కెమెరాలు పోలీసు శాఖకు సమకూర్చాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటాన్ని అరికట్టటంలోనూ, మారుమూల ప్రదేశాల్లో జూదం, వ్యభిచార కేంద్రాల నిర్వహణ వంటి అసాంఘిక కార్యకలాపాలను డ్రోన్ కెమెరాలతో పసిగట్టి అరికట్టేందుకు చర్యలు చేపట్టాం.



చలికాలం.. అప్రమత్తం

జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో జనాలు అల్లాడి పోతున్నారు. పెరిగిన చలితో ముఖ్యంగా పిల్లల్లో, వృద్ధుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. సరైన ఆహారం, చిన్నపాటి జాగ్రత్తలు వహిస్తే వ్యాధుల నుంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.





● గతంలో కంటే పెరిగిన చలి తీవ్రత

● పెద్దలలో పెరుగుతున్న కీళ్ల నొప్పులు

● శీతాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం

● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది జనవరిలో కూడా నమోదు కాని కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది డిసెంబరులోనే నమోదవుతున్నాయి. పెరిగిన చలి తీవ్రతతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదురువుతున్నాయి. జలుబు, దగ్గు, ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు వంటి సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ కాలంలో పిల్లలపై సుక్ష్మక్రీములు దాడి చేస్తుంటాయని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వారు తినే ఆహారం, దుస్తులు, ఆడుకునే బొమ్మలు, చదువుకునే ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. చలి, తగలకుండా వెచ్చదనం ఉండేలా దుస్తులను వేయాలని, మంకీ క్యాప్‌లు, ప్యాంట్లు, ఫుల్ హ్యాండ్స్ చొక్కాలు వినియోగించాలని సూచిస్తున్నారు. పిల్లలకు విటమిన్ సి, ఐరన్, జింక్ ఉన్న ఆహారాన్ని అందించాలని, పండ్లు, పాలు, ఆకుకూరలును ఎక్కువగా ఇవ్వాలని చెబుతున్నారు. కూరగాయలు, గోధములు, నాటు గుడ్లు ఆహారంలో చేర్చాలని అంటున్నారు. ఈ కాలంలో పిల్లలకు నీటిని బాగా తాగించాలని, వారు రోజులకు 12 గంటలు నిద్రపోయేలా చూడాలని చెబుతున్నారు. శీతాకాలంలో పిల్లలు బయటకు వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారి శరీరానికి విటమిన్ డి అందుతుందని వైద్యులు చెబుతున్నారు.

● టీకాలు వేయించాలి

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, నియంత్రిస్తుందని, వీటిని ఏడాది పిల్లలకు రెండు సార్లు, ఆ తరువాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున వేయాలని వైద్యుల సూచిస్తున్నారు. చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

● పెద్దలపై కీళ్ల ఒత్తిడి

చలి పెరిగే కొద్ది వాతవారణ పీడనం తగ్గిపోతుందని, ఈ ఒత్తిడితో పెద్దలలో కీళ్ల చుట్టూ ఉన్న కండరాలు, లిగ్‌మెంట్లు కొద్దిగా ఉబ్బుతుంటాయని వైద్యులు చెబుతున్నారు. దీని కారణంగా కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వస్తాయని, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్న వారికి ఈ నొప్పి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. పెరిగిన చలితో మైగ్రేన్లు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఫైబ్రో మైయాల్జియా, న్యూరోపతిక్, ఆస్టియా ఆర్థరైటిస్ వస్తాయని, ఈ సమయంలో వైద్యులు సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి. మంచి ఆరోగ్యం, నిద్ర, వ్యాయమం తప్పనసరి. విటమిన్ సి ఉన్న పండ్లు పిల్లలు తినేలా చూడాలి. శీతాకాలంలో సర్వసాధారణంగా వచ్చే అనారోగ్యాలు దగ్గు, తుమ్ములు, జలుబు, చర్మం పగలడం వంటివి చూడ్డానికి చిన్నవిగా కనిపిస్తాయి. నిర్లక్ష్యంగా ఉంటే అవే పెద్దవిగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో బ్యాక్టీరియా, వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది. చిన్న పాటి సమస్య అయినా వైద్యులను సంప్రదించాలి. జీజీహెచ్‌లో అన్ని సమయాల్లోనూ వైద్యులు అందుబాటులో ఉంటారు.

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ



అంథోని థామస్ చర్చి వేడుకల్లో గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలి

● బిషప్ డాక్టర్ సీహెచ్ భాగ్యయ్య

రెంటచింతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి హృదయం పవిత్రంగా ఉండాలని, స్వార్థరహిత జీవనం గడపాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి (బిషప్) డాక్టర్ చిన్నబత్తిని భాగయ్య కోరారు. బుధవారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో పునీత థామస్ చర్చి 125వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి స్థానిక విచారణ గురువు హెచ్‌జీఎస్ పవిత్రన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాక ముందు నిర్మించిన ఈ చర్చిని రూ.40లక్షలతో ఆధునీకరించిన తీరు చూడముచ్చటగా ఉందని కొనియాడారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎలీషా రాజ్, మర్రి అనిల్, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసైన్డ్‌పై కొరడా

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తెప్పిం చుకుంది. దీనితో పాటు వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే అంశంతో పాటు, తిరిగి నిషేధిత జాబితాలో చేర్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలేమిటనే రిపోర్టులు కూడా గతంలోనే ప్రభుత్వం చేతికి అందాయి. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకుని, భూ సంబంధిత సమస్యల పరిష్కారం నిర్దిష్ట కాలపరిమితితో జరగాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో అసైన్డ్ అక్రమాలపై కొరడా ఝళిపించడంతో పాటు, అందుకు బాధ్యులైన వారిపై కూడా చర్యలకు దిగనున్నామనే సంకేతాలను ప్రభుత్వం స్పష్టంగా పంపింది.

పదికి.. వంద రోజుల ప్రణాళిక

● మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు

● ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహణ

● సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం




గుంటూరు(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. పదిలో రాష్ట్రస్థాయిలో తమ తమ జిల్లాలను అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యంగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 60వేల మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గతేడాది ఉమ్మడి జిల్లాలో గుంటూరు రాష్ట్రస్థాయిలో టాప్ పదిలో ఉండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు కొద్దిలో వెనుకబడ్డాయి. ఈ నేపథ్యంలో ఈఏడాది ఆయా జిల్లాల్లో కూడా మెరుగైన ఫలితాల కోసం కృషిచేస్తున్నారు.

● సిలబస్ పూర్తి..

ప్రతిరోజు రివిజన్ తరగతులు

పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ఇక నుంచి ప్రతిరోజు స్టడీ అవర్స్ పకడ్బందీగా నిర్వహించడంతోపాటు సబ్జెక్టుల వారీగా అం దులోని పా ఠ్యాంశాలను ఉపాధ్యాయు లు రివిజన్ చేయనున్నారు. ప్రతి రోజు ఉదయం గంట, సాయంత్రం గంటపాటు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించనున్నారు. విద్యార్థులు పాఠశాల పరీక్షల్లో తెచ్చుకున్న మార్కులను విశ్లేషించి స్టడీ అవర్స్ నిర్వహిస్తారు విద్యార్థులను గ్రూపులుగా విభజించి రివిజన్ క్లాసులు నిర్వహిస్తారు. అంతేకాకుండా వారాంతాల్లో సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల మార్కులను బేరీజు వేయనున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నవారికి ఇంకా మెరుగైన శిక్షణ అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలను సేకరించి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



● త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

జిల్లా పరిషత్ నుంచి త్వరలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నారు. ఈ మెటీరియల్ కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. త్వరలో 10వ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం అల్పాహారం అందించేం దుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్టడీ అవర్స్‌ను నిత్యం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యాధికా రులు ఇందుకోసం ప్రత్యేక షెడ్యూలును నిర్దేశించుకొని పాఠశాలలను సం దర్శించి స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించనున్నారు. ఇలా వందరోజుల ప్రణాళిక రూపొందించి పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు.



కొల్లిపర మార్కెట్‌లో వేలం పాటకు వచ్చిన కర్పూర గెలలు

ప్రియమైన అరటి

● గెల రూ. 600 నుంచి రూ 750 పలుకుతున్న వైనం

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

కొల్లిపర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబరులో కురిసిన పెనుగాలులతో కూడిన వర్షాలు అరటి ధరను అమాంతం పెంచేశాయి. ఎన్నడూ లేని విధంగా అరటి గెలల ధరలు పలుకుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌కు సీజన్‌లో ప్రతి రోజూ సుమారు 5 వేల నుంచి 6 వేల వరకు అరటి గెలల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది అక్టోబరు నెలలో పెనుగాలులతో కూడిన వర్షం పడటంతో అరటి తోటలు పాడై ఉత్పత్తి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌కు రోజుకు 200 నుంచి 350కి మించి గెలలూ రావడం లేదు. దాంతో ధరలు చుక్కలనంటుతున్నాయి.

● పోటీపడి కొంటున్న వ్యాపారస్థులు

అరటి ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌కు గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దాంతో వ్యాపారస్థులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. గతంలో మొదటి రకం కర్పూర అరటి గెల ధరరూ.150 నుంచి రూ.200 వరకు పలకగా, రెండో రకం రూ 90.నుంచి రూ.150 వరకూ పలికేది. చక్కెరకేళి రూ.100 నుంచి 150 పలికేది. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.600 నుంచి నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.450 నుంచి రూ.550 ధరలు పలుకుతున్నాయి. చక్కెరకేళి మొదటి రకం రూ.400 నుంచి రూ.450 వరకు, రెండో రకం రూ.250 నుంచి రూ.350 వరకు పలుకుతున్నాయి.

● పంట ఉన్నప్పుడు లేని ధర

ఈ సంవత్సరం రైతుల దగ్గర పంట ఉన్న సమయంలో అరటి గెలలకు ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. తమ పంటలు పాడై ఉన్న సమయంలో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వ్యాపారులు ఇదే అదునుగా డజను అరటి కాయలను రూ.50 నుంచి రూ.60 వరకు, చక్కెరకేళి రూ.100 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. దాంతో వినియోగదారులు అరటి పండ్లను కొనాలంటేనే భయపడుతున్నారు.

అజ్ఞాతంలో భోక్తలు

(7వ పేజీ తరువాయి)

భావించిన వారు పది రోజుల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో 11వ నిందితుడైన నాటి డైరెక్టర్ కూనిశెట్టి శివ నవీన్ ఇప్పటికే కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. రాముతో పాటు మిగిలిన నిందితులు కూడా ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

అక్రమాలు ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాతంశెట్టి సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 5 నుంచి 2021 ఫిబ్రవరి 13 వరకు, 2021 జూలై 24 నుంచి 2024 జూన్ 7 వరకు రెండు విడతలుగా జీడీసీసీబీ చైర్మన్‌గా కొనసాగారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా బోగస్ రుణాల మంజూరు సాగింది. రాము చైర్మన్ కాకముందు మిర్చి టిక్కీకి 1500 తాకట్టు రుణంగా పరిమితి రూ.10 లక్షలు ఉండేది. అయితే ఆయన చైర్మన్ అయిన తర్వాత టిక్కీకి తాకట్టు రుణాన్ని 1500 నుంచి 2000కు, ఆ తర్వాత 4 వేలకు పెంచేశారు. అంతేకాక రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. నిబంధనలకు విరుద్ధంగా విశ్రాంత ఉద్యోగి యర్రంశెట్టి ఈశ్వరప్రసాద్‌ను చిల్లీస్ స్టాక్ క్వాలిటీ కంట్రోలర్ అండ్ వాల్యూవర్‌గా నియమించుకున్నారు. బోగస్ రైతుల పేరుతో, స్టాక్ లేకపోయినా కోల్డ్ స్టోరేజ్ యజమానులకు ఈశ్వర్‌ప్రసాద్ 2023లో 1347 మందికి తాకట్టు అప్రైజర్ సర్టిఫికెట్లు జారీ చేసి రూ.కోట్లలో రుణాలు నొక్కేశారు. నాటి నల్లపాడు బ్రాంచ్ మేనేజర్ దేవరకొండ అరుణ్ కుమారి 2 దఫాలు అక్కడే మేనేజర్‌గా పనిచేయడమే కాకుండా రెండేళ్లలోనే రెండుసార్లు ఉద్యోగోన్నతి పొందడం వెనుక ఇక్కడ జరిగిన కుంభకోణానికి సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈమె మేనేజర్‌గా ఉన్న సమయంలో బినామీ వ్యక్తుల పేర్లతో కోల్డ్ స్టోరేజ్ యజమానులు బ్యాంకుకు రాకుండానే వారి సిబ్బందిని పంపి ఎస్‌బీ ఖాతాలు తెరిచారు. రెండు లక్షలకు పైబడిన రుణాలను తప్పనిసరిగా బ్రాంచ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా సంబంధిత ఖాతాలకు బదిలీ చేయాలి, కానీ నిబంధనల విరుద్ధంగా బ్యాంకులోనే విత్ డ్రా చేశారు. మిర్చిపై తాకట్టు రుణం తీసుకున్న గడువు ముగిసినా స్టాక్ వేలానికి చర్యలు తీసుకోలేదు. నాటి చైర్మన్ రాముతో పాటు నల్లపాడు బ్రాంచ్ మేనేజర్, నాటి సీఈవో, బ్యాంకు డైరెక్టర్లు, అప్రైజర్ అందరూ కుమ్మక్కై 22 కోట్ల 25 లక్షల 5 వేల 439 రూపాయల బోగస్ రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేశారని అధికారుల విచారణలో తేల్చారు.

● లింగాయపాలెంలోని విశ్వసాయి ఫుడ్స్‌పేరుతో 12 కోల్డ్ స్టోరేజీలలో మిర్చిస్టాక్ ఉన్నట్లు బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు.

● అంకిరెడ్డిపాలెంలోని రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్‌లో మిర్చిస్టాక్ లేకపోయినా రూ.13కోట్ల 15లక్షల 7వేల 453 బోగస్ రుణాలు పొందారు.

● నకిలీ డ్వాక్రా గ్రూపులు సృష్టించి వ్యక్తిగత, దీర్ఘకాలిక రుణాలు సుమారు 9 కోట్ల వరకు తీసుకున్నారు.

● వెంగళాయపాలేనికి చెందిన హోసన్నా మహిళ గ్రూప్ బోగస్ అని డీఆర్డీఏ నిర్ధారించినా రూ.14 లక్షలు రుణాలు ఇవ్వాల్సిందిగా నాటి మేనేజర్ అరుణ్‌కుమారి సిఫార్సు చేశారు.

● సంగడిగుంటకు చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా పొదుపు సంఘానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఆమె సిఫారసు చేశారు. అయితే అప్పటికే ఆ గ్రూప్ పేరుతో మరో బ్యాంకులో రూ.8.19 లక్షల రుణం బకాయి ఉంది.

● ఎటువంటి భూములు లేకపోయినా తప్పుడు పత్రాలు సృష్టించి 2021లో కొందరు రూ.9 కోట్లు రుణాలు తీసుకున్నారు. దీనిపై అప్పట్లో నల్లపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఆ కేసు విచారణను ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన కేసు విచారించి బ్యాంక్ మేనేజర్, మాజీ తహసీల్దార్ సహా ఇప్పటి వరకు 11 మందిని అరెస్టు చేశారు.

ఇప్పటికే రాముపై భూకబ్జా ఫిర్యాదు

లాల్‌పురంలో తాను 2011లో డీ నెంబర్ 324/ఎ లో 13 శెంట్ల భూమి కొనుగోలు చేసిన స్థలాన్ని రాము కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురానికి చెందిన ఉప్పు శంకరరావు రెండు రోజుల క్రితం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన స్థలాన్ని కబ్జా చేసి గోడ కడుతుండగా పెద్దమనుషులను పంపి ప్రాధేయ పడితే దూషించడమే కాక దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడన్నారు. దీనిపై విచారించాల్సిందిగా ఎస్పీ నల్లపాడు పోలీసులను ఆదేశించారు.

ఆమె బతికున్నా...!

● అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం

మేడికొండూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు బతికున్నా, రికార్డులలో ఆమెను చంపేశారు. అధికారుల తప్పిదం ఆ మహిళకు శాపంగా మారింది. అన్నదాత సుఖీభవ అధికారుల అలసత్వం కారణంగా ఆమెకు దక్కాల్సిన పీఎం కిసాన్ పరిహారం చేజారింది. మేడికొండూరు మండలం భీమినేని వారిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు మద్దినేని రాధారాణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' పరిహారం జమ కాలేదు. దీంతో విషయం తెలుసుకుందామని ఆమె బుధవారం గ్రామంలోని అన్నదాత సుఖీభవ కేంద్రానికి వెళ్లింది. అక్కడి సిబ్బందిని తన స్టేటస్ చెక్ చేయమని కోరింది. కంప్యూటర్‌లో వివరాలు పరిశీలించిన సిబ్బంది ఒక్కసారిగా నీళ్లు నమిలారు. సిబ్బంది చూపించిన వివరాల ప్రకారం రాధారాణి మరణించినట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదై ఉండడంతో రాధారాణి ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందకుండా పోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు, ఇలా ఇష్టారాజ్యంగా రికార్డులు ఎలా మారుస్తారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, రాధారాణి రికార్డులను సరిచేసి, ఆమెకు రావాల్సిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పరిహారం అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులకు మహర్దశ

(7వ పేజీ తరువాయి)



పిడుగురాళ్లలో అభివృద్ధి చేయనున్న చెరువు

సర్వే చేయించి చెరువుల వాస్తవిక స్థలా న్ని నిర్ధారించారు. నరసరావుపేట మున్సిపాల్టీలో అభివృద్ధి చేసే కత్తవ చెరువులో 10 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయా జిల్లాల్లో గుర్తించిన ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. సంబంధింత పనుల టెండర్ 23వ తేదీ గడువుగా ప్రకటించారు. టెండర్ల అనంతరం పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

మునిసిపాల్టీల వారీగా నిధుల మంజూరు ఇలా..

మునిసిపాల్టీల	చెరువులు	నిధులు రూ.కోట్లలో
నరసరావుపేట	1	5.60
చిలకలూరిపేట	5	3.68
మాచర్ల	1	6.60
పిడుగురాళ్ల	1	11.52
సత్తెనపల్లి	1	0.72
దాచేపల్లి	2	2.50
గురజాల	2	2.10
చీరాల	2	3.05
బాపట్ల	1	1.94
రేపల్లె	3	4.10
అద్దంకి	1	5.10
గుంటూరు	2	17.80
మంగళగిరి.. తాడేపల్లి	7	11.70
పొన్నూరు	1	3.04
తెనాలి	2	10.34

ముగిసిన యువజనోత్సవం

● మూడు రోజులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థులతో డాన్సు చేస్తున్న మాస్టర్ పండు

ఏఎన్‌యూ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల యువజనోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన సాంస్కృతిక పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనిబరిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న ఉత్సాహాన్ని చూసి తన కళాశాల రోజులను గుర్తు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలు త్వరలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవం పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మూడు రోజుల నివేదికను అందజేశారు.

● ఓవరాల్ చాంపియన్‌షిప్ జేకేసీ కైవసం

యువజనోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని జేకేసీ కళాశాల కైవసం చేసుకుంది. రన్నర్‌గా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా కళాశాల నిలిచింది. నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, జానపద కళారూపాలు, నాటకాలు, చిత్రలేఖనం, క్విజ్ విభాగాల్లో విజేతలకు ప్రత్యేక అతిథిగా విచ్చేసిన రియాలిటీ షో ఢీ డ్యాన్సర్ పండు మాస్టర్, ముఖ్యఅతిథి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్ రావు, విశిష్ట అతిథులు వర్సిటీ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిసాస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు బహుమతులు అందజేశారు.

● అలరించిన పండు మాస్టర్ డ్యాన్స్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో నిరంతరం సాధన చేస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని డ్యాన్స్ మాస్టర్ పండు సూచించారు. విద్యార్థులు కళాశాల రోజులను సద్వినియోగం చేసుకోవాలని, మంచి సువర్ణావకాశాన్ని కోల్పోవద్దన్నారు. తాను ఐటీ కళాశాలలో చదువుకున్నానని, డాన్స్, నటనపై మక్కువతో కళా రంగంలోకి ప్రవేశించానని చెప్పారు. అనంతరం ఇటుక మీద ఇటుక పెట్టి, నాది నెక్లెస్ గొలుసు పాటలకు పండు మాస్టర్ చేసిన డ్యాన్స్ విద్యార్థులను అలరించింది. ముగింపు ఉత్సవాల్లో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, పాలక మండల సభ్యుడు ఆచార్య కె.సుమంత్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ఫార్మసి కళాశాలప్రిన్సిపాల్ ఆచార్య తేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులు రూపొందించిన కళాకృతులు



ముగ్గు వేస్తున్న విద్యార్థిని

13న గుంటూరు, ప్రకాశం జిల్లాల డబుల్స్ షటిల్ టోర్నమెంట్

నాదెండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామంలోని సీఆర్ కళాశాలలో సీఆర్ కళాశాల షటిల్ ప్లేయర్స్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గం, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల డబుల్స్ ఓపెన్ షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బత్తుల ప్రసాదు, ఫ్రెండ్స్ సర్కిల్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ సీఆర్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో సాయంత్రం ఆరు గంటలకు ఈ పోటీలను కళాశాల అధ్యక్షుడు చుండి రంగనాయకులు, మేనేజింగ్ డైరెక్టర్ చుండి వేణుబాబులు ప్రారంభిస్తారని వివరించారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.8వేలు, రూ.6వేలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పోటీలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు నగదు బహుమతిగా ఇస్తారని వివరించారు. వివరాలకు 8886564747 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు స్వాతి షాపింగ్‌మాల్ పునఃప్రారంభం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట సెంటరులోని స్వాతి షాపింగ్ మాల్ గురువారం ఉదయం పునః ప్రారంభించనున్నట్లు స్వాతి షాపింగ్ మాల్ యాజమాన్యం తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రముఖ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బీసీ హాస్టల్ నిర్మాణ పనులను పరిశీలించిన డీఈ

నూజెండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాయిస్ హాస్టల్‌లో నిర్మాణం జరుగుతున్న స్నానపు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్‌రాజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో నూజెండ్ల బీసీ బాలుర వసతి గృహం వద్ద పది స్నానపు గదులు, పది మరుగుదొడ్లు రూ.30లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఉప్పలపాడు గురుకుల పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద రూ.3లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మా భూములను అప్పగించండి: దళిత దివ్యాంగురాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన తన భూమిని కాపాడి తమకు అప్పగించాలని ఓ దళిత దివ్యాంగురాలు బుధవారం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డు చెక్కవాగు సమీపంలోని 309/1-3బీలో 2ఎకరాల భూమిని తన తల్లి బొప్పుడి మేరాయమ్మ కొనుగోలు చేసిందని, వారసత్వ హక్కుగా లభించిన భూమి 2022 వరకు తన ఆధీనంలో ఉందని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మా భూమి పక్కన 4ఎకరాలు కొనుగోలు చేసి, అధికారాన్ని అడ్డంపెట్టుకొని మా రెండు ఎకరాలు కూడా తప్పుడు రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఇటీవల బొల్లా వద్ద 6ఎకరాలు కొనుగోలు చేసిన వ్యక్తి భూమిని చదును చేస్తుండగా తాము అడ్డుకున్నామన్నారు.

'సురభి వెంకటేశ్వర్లుపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి'

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలలపాలెంకు చెందిన సురభి వెంకటేశ్వర్లుపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును వారు పరామర్శించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో ఉన్న సురభి వెంకటేశ్వర్లుపై దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు వై.వెంకటేశ్వర్లు, వి.కోటనాయక్, మస్తాన్‌వలి, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

పది విద్యార్థులకు పోత్సాహకాలు

బొల్లాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పది విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు బుధవారం పది విద్యార్థులకు పోత్సాహకాలను ప్రకటించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.20వేలు, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.10వేలు అందజేయనున్నట్టు తెలిపారు.

తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పుకొండ, కొప్పుకొండ తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జి.వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు పంట నమోదు చేయించుకొని, పండించిన వరి ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా కనీస మద్దతు ధరకు విక్రయించాలన్నారు. గ్రేడ్ ఏ రకం క్వింటా రూ.2389లు, సాధారణ రకం రూ.2369లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, వీహెచ్‌ఏ గోపి, రైతులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, పరగటిచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాసరావు మొక్క జొన్న పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఆకులు నీలి రంగులో మారితే అవి భాస్వరం లోపం వల్ల అని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఉత్సాహంగా పారా ఒలింపిక్స్



విజేతకు బహుమతులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీడబ్ల్యూఎస్ఎన్ (చిల్డ్రెన్ విత్ స్పెషల్ నీడ్స్) పారా ఒలింపిక్ క్రీడలు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు విభిన్న ప్రతిభావంతుల ర్యాలీలో పాల్గొని, పారా ఒలింపిక్ క్రీడలలో విజయం సాధించిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మ్యాజిక్ షోలు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఇంద్ర ధనుస్సు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇందులో దివ్యాంగులకు ఏడు వరాలను ప్రకటించారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు వందశాతం ఉచిత ప్రయాణం, ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో దివ్యాంగులకు నామినేటెడ్ స్థానాలు, ఎన్నికలలో ఓడిపోయినా ఎగ్జిక్యూటివ్ సభ్యత్వం, గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన ఆర్థిక సబ్సిడీ పథకాలు దివ్యాంగులకు తిరిగి ప్రవేశ పెట్టడం, డీఎస్సీ, క్రీడలలో ప్రత్యేక అవకాశాలు, ప్రత్యేక శిక్షణ కేంద్రాలు, ప్రభుత్వ ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే దివ్యాంగులకు కేటాయింపు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో గ్రౌండ్ ఫ్లోర్‌లో సీటింగ్, ర్యాంపులు, లిఫ్టులు, అమరావతిలో దివ్యాంగభవన్ నిర్మాణం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విజువల్లి ఛాలెంజ్ యూత్ అసోసియేషన్, కూటమి నాయకులు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎన్.సుబ్బరాయగుప్తా, ఆర్.రామకృష్ణ, పి.ఆంథోని సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయపాలెంలో కాటూరి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. సుమారు 300మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆలయంలో పూజలు

మండలంలోని లింగంగుంట్లలో ఎన్ఎస్‌పీ కాలనీ వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు.

రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆర్డీవో మధులత అధ్యక్షతన రెవెన్యూ శాఖ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ విప్ జీవీఆంజనేయులు పాల్గొని ముందుగా వివిధ గ్రామాల నుంచి హాజరైన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని ఎన్డీఏ నాయకులను కోరారు. వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో వైసీపీ పాలనలో జగనన్న కాలనీలకు ఇచ్చిన భూమికి పట్టాలు ఎలా ఇచ్చారని గ్రామానికి చెందిన సుబ్బయ్య నిలదీశారు. వినుకొండ పట్టనంలో హిందూ శ్మశాన వాటిక లేదని జనసేన పార్టీకి చెందిన నాగశ్రీను రాయల్ తెలిపారు. వెంటనే భూమిని కేటాయించాలని తహసీల్దార్ సురేష్‌కు జీవీ ఆదేశించారు. అదేవిధంగా బొల్లాపల్లి మండలంలో భూములను గుర్తించి వాటికి పట్టాలు ఇవ్వాలని పెమ్మసాని నాగేశ్వరరావు, వాసుదేవరెడ్డి అధికారుల కోరారు. అగ్రహార భూములకు ఆన్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో రైతులు రుణాలు పొందలేక పోతున్నారని వినుకొండ మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్థలం నివాసం ఉంటున్న వారందరికి పట్టాలు ఇవ్వాలని, 2019 తర్వాత అగ్రిమెంట్లు చేసుకున్న భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అగ్రహారం భూములకు తహసీల్దార్లు వెంటనే పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారసత్వ భూములకు ప్రభుత్వం కేవలం రూ.100కే రిజిస్ట్రేషన్ కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ఏళ్ల నాటి నుంచి సాగు చేసుకుంటున్న ఫారెస్టు స్థలాలకు పట్టాలు అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏమైనా భూములు బ్లాక్ లిస్టులో ఉంటే తక్షణం వాటిని పరిష్కరించాలని అన్నారు. త్వరలో ఈపూరు మండలంలో ఏళ్ల నాటి నుంచి ఫారెస్టు స్థలంలో నివాసం ఉండే వారందరికీ పట్టాలు ఇస్తామని తెలిపారు. ఎవరైనా వీఆర్వోలు, అధికారులు అవినీతికి పాల్పడితే వెంటనే తమదృష్టికి తీసుకురావాలని, అలాంటి అధికారులపై ఆర్డీవో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ మురళీకృష్ణ యాదవ్, డివిజనల్ సర్వేయర్ అధికారి యాదాల శ్రీనివాసరావు, ఫారెస్టు అధికారి మాధవరావు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి మధుస్వామి

నరసరావుపేట లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని కోర్టు ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కే.మధుస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ వర్గాల వారి, దివ్యాంగుల హక్కులను గౌరవించాలన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది అచ్చి ఏడుకొండలు, పీఎల్‌వీ అబ్దుల్ రజాక్, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ సూపర్‌హిట్

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ సూపర్ హిట్ అయిందని వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలో సేకరించిన 62,500 సంతకాలను బుధవారం నరసరావుపేట నియోజకవర్గ వైసీపీ కార్యాలయం నుంచి లింగంగుంట్లలోని వైసీపీ జిల్లా కార్యాలయానికి ర్యాలీగా తీసుకువెళ్లారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి సేకరించిన సంతకాలను ఈ నెల 15వ తేదీన నరసరావుపేటలోని వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి తాడేపల్లి కార్యాలయానికి తరలించడం జరుగుతుందన్నారు.. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నరసరావుపేట లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని పెద్ద చెరువులోని రాజీవ్ గృహకల్పలో చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ సీహెచ్ ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు తోవకుంట శ్రీలక్ష్మి (37), పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యంతో వివాహం అయింది. ఇటీవల శ్రీలక్ష్మి పట్టణంలోని ఏనుగుల బజారు చెందిన బాజీతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. శ్రీలక్ష్మిని బాజీ హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ ఉంచాడు. ఈ నేపథ్యంలో ఇటీవల పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద బాజీని మృతురాలి భర్త సుబ్రహ్మణ్యం, తల్లి రాంబాయమ్మ హతమార్చారు. ఈ మేరకు ప్రాథమిక నిర్ధారణ అనంతరం నరసరావుపేట రూరల్ పోలీసులు మృతురాలి తల్లి రాంబాయమ్మ, భర్త సుబ్రహ్మణ్యంలను అరెస్టుచేసి నరసరావుపేట సబ్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. ఈ నేపథ్యంలో మూడు రోజులు క్రితం లక్ష్మి పట్టణంలోని పెద్ద చెరువులోని స్వగృహకల్పలో ఉంటున్న ఆమె అన్న వద్దకు వచ్చింది. రిమాండ్‌లో ఉన్న తన భర్త, తల్లిలను ములాఖత్‌లో కలిసి మాట్లాడింది. అనంతరం మంగళవారం రాత్రి దూలానికి ఉరివేసుకొని మృతిచెందింది. అర్ధరాత్రి సమయంలో ఇది గమనించిన ఆమె అన్న రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ ప్రభాకరరావు సిబ్బందితో ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నామని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఎన్ఈసీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ పట్టాను చూపుతున్న షేక్‌ఎండీ షరీఫ్ కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న షేక్ ఎండీ షరీఫ్ సిగ్నల్ ప్రాసెసింగ్ విభాగంలో చేసిన పరిశోధనలకు కేఎల్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ ప్రొవిజనల్ పట్టాను అందుకున్నట్లు కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో అసిస్టెంటు ప్రొఫెసర్ షేక్ ఎండీ షరీఫ్‌ను కళాశాల వైస్‌ఛైర్మన్ చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు అభినందించారు.

20 మంది వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ కళాశాలలో అవేరిక్స్ సొల్యూషన్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ బుధవారం నిర్వహించింది. కంపెనీకు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 20మంది బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ అన్నారు. కంపెనీ ప్రతినిధులు వెంకట అవినాష్, ఎన్‌పీ చందనలు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ట్రైనింగ్ పూర్తయిన తరువాత రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీవో పుష్ప ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిసోర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కరాటే పోటీల్లో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న రమావత్ హనుమానాయక్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2025లో టైక్వాండో క్యోరుగి 63 కిలోల కేటగిరిలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి రమావత్ హనుమానాయక్ బంగారు పతకం సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ బుధవారం తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించాడన్నారు. రమావత్ హనుమానాయక్‌ను కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయి, వీడీ యక్కల మధుసూదనరావు తదితరులు అభినందించారు.

యూత్ ఫెస్టివల్‌లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఈ నెల 9న జరిగిన పల్నాడు జిల్లా యూత్ ఫెస్టివల్-2025లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గ్రూప్ ఫోక్ డాన్స్‌లో ప్రథమ, కథా రచనలో ప్రథమ, ద్వితీయ, డిక్లమేషన్‌లో ప్రథమ, ద్వితీయ, కవిత్వంలో ప్రథమ, ద్వితీయ, పెయింటింగ్‌లో ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను డాక్టర్ యోగేశ్వరరావు, సర్దార్, సతీష్, టీ బాబు, శైలజరాణి తదితరులు అభినందించారు.

డీఈవో చంద్రకళకు ఎస్టీయూ నేతల సత్కారం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళుతున్న పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు బుధవారం ఎస్టీయూ పల్నాడు జిల్లా శాఖ నాయకులు మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ ఏమండి, జిల్లా ఆర్థిక కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, గౌరవాధ్యక్షుడు కే ఏసయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌కే కరీముల్లా, పీవీ మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు టీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



డీఈవో చంద్రకళను సత్కరిస్తున్న సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ఎల్వీ రామిరెడ్డి తదితరులు

వినతులు స్వీకరించిన జీవీ



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా వినతులు స్వీకరించి వారి సమస్యలు శ్రద్ధగా ఆలకించారు. వసతి, విద్యుత్, పింఛన్లు, ఇళ్ల స్థలాలు వంటి పలు అంశాలపై వినతిపత్రాలు వచ్చాయి. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులు ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

పరిశ్రమలకు రూ.8.68 కోట్లు రాయితీ

● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి వివిధ రాయితీల కింద ప్రభుత్వం నుంచి రూ.8.68 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. పరిశ్రమల అభివృద్ధిపై కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం.ఈజీపీ ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి వచ్చిన దరఖాస్తులను బ్యాంకులకు వెనువెంటనే పంపించాలని అధికారులకు సూచించారు. పీఎం విశ్వకర్మ దరఖాస్తుదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఝన్సీరాణి, ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు, నైపుణ్య అభివృద్ధి అధికారి తమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు, ఏపీఐసీసీ అధికారి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోండా నూతన షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హోండా నూతన షోరూమ్ నరసరావుపేటలో బుధవారం ప్రారంభమైంది. నరసరావుపేట పట్టణం రావిపాడు రోడ్డులో నూతన షోరూమ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత చుక్కపల్లి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ హోండా ద్విచక్రవాహనాలు తగ్గిన జీఎస్టీ ధరలకు పల్నాడు జిల్లా వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సర్వీస్ సెంటర్‌లో నైపుణ్యంగల సిబ్బంది, నాణ్యమైన ఒరిజనల్ స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. హోండా మోటార్ సైకిల్, స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ ఇండియా కస్టమర్ సర్వీస్ జనరల్ మేనేజర్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ప్రపంచస్థాయి సర్వీస్ సెంటర్‌ను పల్నాడు వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. కార్యక్రమంలో హోండా కంపెనీ ప్రతినిధులు జోనల్ సేల్స్ ఇన్‌చార్జి శరత్ ఉండ్రే, సర్వీస్ ఇన్‌చార్జి గణేష్ ప్రసాద్, ఏరియా సేల్స్ ఇన్‌చార్జి రోహిత్‌సింగ్, పఠాన్ సుభాని, ఏవీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు

బాస్కెట్ బాల్ విజేత ధనలక్ష్మి కళాశాల

ఈపూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్టు బాస్కెట్‌బాల్ విజేతగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు బుధవారం తెలిపారు. ఈ నెల 8, 9వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలలో విజేతగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు బలరాం, ప్రసాదు, వాసు, అరవిందు అభినందించారు.

అధికారులు ప్రశాంతంగా ఎన్నికలు జరిపించాలి

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రశాంతంగా ఎన్నికలు జరిపించాలని గురజాల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కాసు మహేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మాచవరం మండలంలో మండల ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే ఎంపీటీసీ బంధువులను అపహరిస్తుంటే ఏమి చేయాలని ప్రశ్నించారు. దాచేపల్లి సీఐ భాస్కరరావు ఎస్సీ, ఎస్టీ ఎంపీటీసీల పిల్లల్ని, మహిళలను తీసుకెళ్లి పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టి గంజాయి కేసుపెడతామని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. మొత్తం 14 ఎంపీటీసీలలో వైసీపీకి 11 మంది, 3 టీడీపీకి ఉన్నాయన్నారు. పోలీసుల చర్యలపై ఎస్పీ, కలెక్టర్ స్పందించాలని కోరారు. ఎన్నికల తీరుపై కోర్టులో న్యాయపోరాటం చేస్తామన్నారు. రేపు జరగాల్సిన ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిపించాలని ఎలక్షన్ కమీషన్, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.

వెల్లటూరు జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ లీడర్ల ఎన్నిక

బొల్లాపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో పాఠశాల విద్యార్థులు తరగతి లీడర్‌ను, డిప్యూటీ లీడర్ ఎన్నికలను బుధవారం పాఠశాల హెచ్‌ఎం బోళా హోసన్న ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య అవగాహన, హక్కులు, బాధ్యతలపై చైతన్యం కల్పించేలా ఎన్నికలు నిర్వహించటం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఫలితాల్లో ఎస్‌పీఎల్ అభ్యర్థి ఎం.హనుమానాయక్ తన సమీప ప్రత్యర్థి వై.రాజ్‌కుమార్‌పై 128 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు హెచ్‌ఎం తెలిపారు. డిప్యూటీ ఎస్‌పీఎల్‌గా జానకిరాముడు విజయం సాధించాడన్నారు. ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులు చంద్రజిత్తు యాదవ్, పవిత్ర, ఏకేవీ ప్రకాష్, నాగేశ్వరరావు, ప్రత్యూష, జ్ఞానేశ్వరి, పుష్పలీల, సైదా, విజయబాబు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.